దర్గాగా కబ్జా

చెరువు అలుగు కాలువలను ఆక్రమించి లేఅవుట్ నిర్మాణం

- ప్లాట్లు సైతం విక్రయం
- తెలియక కొనుగోలు చేసిన పలువురు
- నిర్మాణాలపై రైతుల ఆందోళన
- లోకాయుక్తలో కేసు నమోదు
- రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సర్వే


ఆత్మకూరు: మేజర్ పంచాయతీగా ఉన్న ఆత్మకూరు దశాబ్దకాల క్రితం మున్సిపాలిటీగా రూపాంతరం చెందింది. ప్రస్తుతం పట్టణానికి సమీప గ్రామాల నుంచి వలసలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్ పరిధిలో రియల్ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలిశాయి. ఇదే అదునుగా ప్రభుత్వ భూములు, చుక్కల భూములు, సాగునీటి కాలువలు, చెరువు అలుగు కాలువలను సైతం ఆక్రమించి వెంచర్లు వేసి రియాల్టర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఆక్రమణల విషయం తెలియని ఎంతో మంది లక్షలాది రూపాయలు వెచ్చించి ప్లాట్లు కొనుగోలు చేసి మోసపోతున్నారు. మున్సిపల్ పరిధిలోని ఆత్మకూరు–నెల్లూరుపాళెం రహదారి పక్కనే ఏర్పాటు చేసిన స్పార్క్‌సిటీ వెంచర్‌లో అలుగు కాలువలను సైతం దర్గాగా ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయించేశారు. ఈ లేఅవుట్‌లో సర్వే నంబర్ 898లో 2.78 ఎకరాలు, సర్వే నంబరు 900లో 1.08 ఎకరాలు కలిపి మొత్తం 3.86 ఎకరాలు ఆత్మకూరు మేజర్ చెరువు అలుగు కాలువలుగా ఆర్ఎస్ఆర్ (డైక్లాట్)లో నమోదై ఉన్నాయి. అయితే ఈ కాలువలను సదరు వెంచర్ వేసిన రియల్టర్ ఆక్రమించి చదును చేసి ప్లాట్లుగా విక్రయించాడు. ఈ విషయమై లోకాయుక్తలో కేసు నమోదై విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టౌన్‌ప్లానింగ్ కంట్రిబోర్డు అలుగు కాలువ సర్వేనంబర్లలో నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు నోటీసులు పంపింది.



అలుగు కాలువను చదును చేసి నిర్మిస్తున్న కల్యాణ మండపం

తాజాగా కల్యాణ మండపం నిర్మాణంతో..

ఇటీవల సర్వే నంబర్లు 900, 901లో కలిపి మూడు ప్లాట్లు కొన్న ఓ వ్యక్తి కల్యాణ మండపం పనులు ప్రారంభించాడు. దీంతో సర్వే నంబరు 900 అలుగు కాలువ కింద ఉందని కొందరు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయగా వారు పనులను నిలుపుదల చేయించారు. అయితే కొద్ది రోజులు పనులు నిలిపివేసిన సదరు వ్యక్తి తిరిగి మళ్లీ పనులు చేపట్టడంతో విషయం రచ్చకెక్కింది. దీంతో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గత రెండు రోజుల క్రితం అలుగు కాలువల సర్వే నిర్వహించారు. 900 సర్వే నంబరులో అలుగు కాలువ ఉందని నిర్ధారించారు. కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్న వ్యక్తి 900 సర్వే నంబరులో ఉన్న కాలువను సర్వే నంబరు 902 చుక్కల భూమి కావడంతో ఎవ్వరు అడగరన్న ధీమాతో దాన్ని డైవర్షన్ చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లుగా గుర్తించారు. ఈ మేరకు జేసీ, ఆర్డీఓలకు నివేదిక అందజేసినట్లు అధికారులు తెలిపారు.



డైక్లాట్‌లో సర్వే నంబరు 900లో కనబర్చిన అలుగు కాలువలు

అలుగు కాలువల ఆక్రమణతో..

ఆత్మకూరు మేజర్ చెరువును 14వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవరాయలకాలంలో తిమ్మరాజయ్య అనే సైన్యాధ్యక్షుడు నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. ఆత్మకూరు చెరువు అలుగునీటిని వాశిలి చెరువుకు తరలించేలా కాలువలు నిర్మించారు. ఈ అలుగు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే అనర్థాలు తప్పవు. అలుగు కాలువలు ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో అలుగునీరు పట్టణంలోని 5, 14 వార్డుల్లోని శివారు ప్రాంతాలు, ఎల్ఆర్‌పల్లి, జేఆర్‌పేట ప్రాంతాలను ముంచెత్తే అవకాశం ఉంది. దీంతో అలుగు కాలువలపై ఆక్రమణలపై ఆయా ప్రాంతాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కాలువను కుదించి దారిమళ్లించిన దృశ్యం

వాశిలి చెరువుకు ప్రమాదఘంటికలు

ఆత్మకూరు చెరువునీటిని పూర్తి స్థాయిలో నింపకుండా అలుగు మట్టానికి తగ్గించి నింపేలా లోపాయికారిగా కొందరు లాలూచి పడుతున్నట్లుగా రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇలా నీటిని చెరువుకు తగ్గించి నింపడంతో భవిష్యత్‌లో అలుగు కాలువలు ప్రవహించక వాశిలి చెరువు ఎండిపోయే అవకాశం ఉంది. అదే జరిగితే ఆయకట్టు పరిధిలోని నరసాపురం, జాలయ్యనగరం, వెంకట్రావుపల్లి, తదితర గ్రామాలకు చెందిన భూములు బీళ్లుగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాలను అధికారులు దూరదృష్టితో పరిశీలించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని రైతులు కోరుతున్నారు.

నివేదిక అందజేశాం

లోకాయుక్తాకు అందిన ఫిర్యాదు మేరకు స్పార్క్‌సిటీ వెంచర్ పరిధిలో ఆక్రమణకు గురైన అలుగు కాలువలను పరిశీలించాం. సర్వే నంబరు 900లో అలుగుకాలువ ఉండగా, దాన్ని 902లోకి మళ్లించి కల్యాణ మండపం నిర్మాణం చేపడుతున్నట్లుగా గుర్తించాం. ఈ మేరకు వాస్తవ పరిస్థితులను పొందుపరుస్తూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేశాం.

–రవికుమార్, ఇన్‌చార్జి ఈఈ, ఇరిగేషన్

ఆక్రమణలను తొలగించాలి

ఆత్మకూరు చెరువు అలుగు కాలువలు ఆక్రమణకు గురైతే భవిష్యత్తులో వాశిలి చెరువు ఎండిపోయే ప్రమాదం ఉంది. అది నాలుగు గ్రామాల రైతులకు శాపమవుతుంది. అధికారులు క్షేత్ర స్థాయిలో పక్కాగా కాలువల సర్వే నిర్వహించి ఆక్రమణలను తొలగించి సమస్యను పరిష్కరించాలి.

–సుధాకర్‌రెడ్డి, వెంకట్రావుపల్లి

ఉత్తరకాలువకు సోమశిల జలాలు

ఆత్మకూరురూరల్: ఐఏబీ సమావేశంలో ఉత్తరకాలువ 50.091 రెగ్యులేటర్ వరకు సాగునీరు అందించాలని తీర్మానం చేశారు. స్వయంగా స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పది రోజుల క్రితం సోమశిల జలాశయం వద్ద ఐఏబీ తీర్మానాల ప్రకారం సాగునీరు విడుదల చేస్తున్నట్లు ప్రకటించినా ఆచరణలో సాధ్యం కాలేదు. ఉత్తర కాలువకు నీటిని విడుదల చేయడంలో జాప్యం జరిగింది. దీంతో కొద్దిపాటి నీటి వనరులతో పోసుకున్న నారుమళ్లు ఎండుముఖం పట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై 'సాక్షి'లో 'ఉత్తర కాలువ నీరందక నారుమళ్లు ఎండుముఖం' శీర్షికన శనివారం ప్రచురితమైన కథనంతో సోమశిల జలాశయం అధికారులు స్పందించారు. ఉత్తర కాలువకు నీటి విడుదల చేశారు. సోమశిల ప్రాజెక్ట్ నార్త్ డివిజన్ డీఈ మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతుల నుంచి డిమాండ్ లేని కారణంగా సాగునీటి విడుదలలో జాప్యం జరిగిందన్నారు. అప్పటికీ వంద క్యూసెక్కుల చొప్పున ఉత్తరకాలువకు విడుదల చేశామన్నారు. ప్రస్తుతం పత్రికల్లో వచ్చిన వార్తలతో పాటు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని శనివారం నీటి విడుదల స్థాయిని 200 క్యూసెక్కులకు పెంచామన్నారు. అవసరమైతే 300 క్యూసెక్కుల విడుదలకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఐఏబీ తీర్మాణం ప్రకారం 50.091 రెగ్యులేటర్ వరకు సోమశిల జలాలు అందిస్తామన్నారు. 50 కిలోమీటర్ల తరువాత ఉత్తర కాలువ విస్తరణ పనులు చేపట్టాల్సి ఉన్నందున మిగిలిన రైతులు సోమశిల జలాలపై ఆధారపడి పంటల సాగుచేయవద్దని కోరారు.

సాక్షి ఎఫెక్ట్..



శనివారం రాత్రి ఏడు గంటలకు ఉత్తరకాలువలో 33ఆర్ రెగ్యులేటర్ వరకు చేరిన జలాలు

ప్రమాదభరితంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

జలదంకి: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద యాదవ వీధికి వెళ్లే దారి పక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ రక్షణ కంచె లేక ప్రమాదభరితంగా ఉంది. యాదవవీధిలోని రైతులు తమ గేదెలు, జీవాలను మేతకు పొలాల్లోకి తోలుకెళుతుంటారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పిచ్చిచెట్లు పెరిగి ఉండడంతో పశువులు, జీవాలు వాటిని తినేందుకు వెళ్తున్నాయి. అలాగే ఈ మార్గంలోనే విద్యార్థులు ఉన్నత పాఠశాలకు వెళ్తుంటారు. దీంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి పిచ్చిచెట్లను తొలగించి రక్షణ కంచె నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



తిరంగా ర్యాలీ జయప్రదానికి పిలుపు

ఆత్మకూరు: పహల్గాంలో ఉగ్రవాదుల పైశాచికానికి బలైన పౌరుల ఆత్మశాంతి కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడం దేశానికి గర్వకారణమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో తిరంగా ర్యాలీపై కూటమి పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన సైనికులకు కృతజ్ఞతలు తెలుపుతూ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికుల జ్ఞాపకార్థంగా, గౌరవ సూచకంగా ఆత్మకూరులో ఆదివారం తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ కార్యాలయం వద్ద నుంచి ప్రారంభమయ్యే ర్యాలీ సోమశిలరోడ్డు సెంటర్, బీఎస్సార్ సెంటర్, సినిమాహాలు సెంటర్ మీదుగా సత్రం సెంటర్ వరకు సాగుతుందన్నారు. అనంతరం సత్రంసెంటర్ వద్ద మాజీ సైనికులతో కలిసి సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశగౌరవానికి ప్రతీకగా నిలిచే తిరంగా ర్యాలీలో అన్ని వర్గాల ప్రజలు జాతీయ జెండాలతో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కూటమి నాయకులు టీ గిరినాయుడు, మల్లికార్జునరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి, కే రవీంద్రరెడ్డి, టీ చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛగ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

జలదంకి/ఉదయగిరి/దుత్తలూరు/అల్లూరు/సంగం: అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రజలు తమ గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు. జలదంకి మండలం కమ్మవారిపాళెంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలో మొక్కలు నాటారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. డ్వామా ఏపీడీ మృదుల, తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీఓ బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే ఉదయగిరిలో సర్పంచ్ పావులూరి సామ్రాజ్యం, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా ఆధ్వర్యంలో బీట్ ద హీట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే ఉదయగిరి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో సబ్‌రిజిస్ట్రార్ మెల్కిరోషన్ చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. వింజమూరులోని పోలీసుస్టేషన్, పాతబస్టాండ్ సెంటర్లలో పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి , సర్పంచ్ సృజన, తదితరులు పాల్గొన్నారు. దుత్తలూరులో డిప్యూటీ ఎంపీడీఓ మల్లికార్జున ఆధ్వర్యంలో బీట్ ద హీట్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించి పక్షులకు నీళ్లు పెట్టారు. అలాగే అల్లూరు బస్టాండ్ సెంటర్‌లో శనివారం కమిషనర్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం బీట్ ది హీట్ కార్యక్రమంలో భాగంగా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సంగంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తహసీల్దార్ సోమ్లానాయక్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సంగం సొసైటీ వద్ద సీఈఓ దస్తగిరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీసీఓ గుర్రప్ప ప్రారంభించి మొక్కలు నాటారు.

క్లుప్తంగా

ముగిసిన లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్లలోని హరిహర క్షేత్రంలో జరుగుతున్న లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు శనివారం రాత్రి ఏకాంతసేవతో ముగిశాయి. శ్రీదేవి, భూదేవి, లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి ఏకాంతసేవను జరిపారు. ఏకాంతసేవకు ఉభయకర్తగా రూపినేని వెంకటేశ్వర్లు నాయుడు,మాధవి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కాగా బ్రహ్మోత్సవాల నిర్వాహకుడు, ఆలయ మాజీ చైర్మన్ లెక్కల చినకొండారెడ్డి, ఆలయ ఈఓ బండి శాంతయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వింజమూరు పంచాయతీ ఈఓగా గోపి శ్రీనివాస్



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల ఓఈ పీఆర్డీ గోపి శ్రీనివాస్ వింజమూరు మేజర్ పంచాయతీ ఈఓగా అదనపు బాధ్యతలను శనివారం స్వీకరించారు. వింజమూరు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న శివకుమార్ కోవూరులో పనిచేసిన సమయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు విచారణలో తేలడంతో వారం రోజుల క్రితం ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మండల ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న గోపి శ్రీనివాస్ ఈఓగా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

వైభవంగా కల్యాణోత్సవం



సీతారామపురం : మండలంలోని సంగసానిపల్లిలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి మేళతాళాల నడుమ సంప్రదాయబద్ధంగా కల్యాణాన్ని నిర్వహించారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్: మండలంలోని కృష్ణంపల్లెలో శుక్రవారం రాత్రి జరిగిన ఘర్షణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే ఇంద్రసేనారెడ్డి శనివారం తెలిపారు. తనతో పాటు తన కుటుంబసభ్యులు, అడ్డువచ్చిన వారిపై ఆవుల రత్తయ్య, జక్కల బాలకృష్ణ నానాదుర్భాషలాడి దాడి చేశారని కృష్ణంపల్లెకు చెందిన సింగనబోయిన కుమారి ఫిర్యాదు చేసిందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కావలికి శృంగేరీ పీఠాధిపతి ఆగమనం

కావలి(జలదంకి): పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న పునఃప్రతిష్ఠ కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా శనివారం విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. కాగా కుంభాభిషేక మహోత్సవానికి ఆగమనం చేసిన శృంగేరీ శారదా పీఠం అధిపతి విధుశేఖర భారతిస్వామికి ఆలయ పాలకవర్గ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి పీఠ పూజ, ధూళి పాదపూజ నిర్వహించారు. అనంతరం విధుశేఖర భారతి స్వామి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. చివరి రోజైన ఆదివారం కుంభాభిషేక మహోత్సవాన్ని భారతిస్వామి చేతుల మీదుగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చేజర్ల(ఆత్మకూరు): చేజర్లలోని 133/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ లిఖితేష్‌రెడ్డి శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరామర్శ

వరికుంటపాడు: వరికుంటపాడుకు చెందిన బీజేపీ సీనియర్ నేత ఆంధ్రా పరంధామిరెడ్డిని మాజీ ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సతీమణి శాంతకుమారి శనివారం పరామర్శించారు. ఇటీవల పరంధామిరెడ్డి సతీమణి మరణించారు ఈ నేపథ్యంలో కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

అనంతసాగరంలో ఓ మోస్తరు వర్షం



సోమశిల: అనంతసాగరం మండలంలో శనివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని ఈదురుగాలులు, మెరుపులతో వర్షం కురిసింది. వర్షం పచ్చిరొట్టపైర్లకు మంచి చేస్తుందని, దుక్కులు చేసిన పొలాలు చల్లబడుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దరఖాస్తుల పరిశీలన వాయిదా

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో శనివారం జరగాల్సిన ఎస్సీ కార్పొరేషన్‌కు సంబంధించిన సబ్సిడీ రుణ దరఖాస్తుల పరిశీలనను వాయిదా వేసినట్లు ఎంపీడీఓ అప్పాజీ తెలిపారు. తిరిగి ఎప్పుడు పరిశీలించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఓబీఎంఎస్ వెబ్‌సైట్ ఓపెన్ అయి ఉన్నందున ఇంకా ఎవరైనా దరఖాస్తు చేసుకోని వారు ఉంటే వెంటనే చేసుకోవాలని సూచించారు. మైనార్టీ రుణాల కోసం మైనార్టీలు ఓబీఎంఎస్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ కోర్టు

ఆత్మకూరు: భూ సమస్యల పరిష్కారానికి ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ కోర్టును శనివారం నిర్వహించారు. ఆర్డీఓ బీ పావని ఆధ్వర్యంలో 12 రెవెన్యూ కేసులను విచారించారు. ఆర్డీఓ కార్యాలయ ఏఓ, పలువురు తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

నాగార్పమ్మ తిరునాళ్ల ప్రారంభం

ఆత్మకూరురూరల్: మండలంలోని బంట్లపల్లిలో నాగార్పమ్మ తిరునాళ్లను శనివారం వైభవంగా ప్రారంభించారు. తొలిరోజు మేకల కుటుంబీకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

గడ్డివామి దగ్ధం

సంగం: విద్యుత్ వైర్లు రాసుకుని నిప్పు రవ్వలు ఎగిసి పడడంతో గడ్డివామి దగ్ధమైన ఘటన అరవపాళెంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు..జెండాదిబ్బ పంచాయతీ అరవపాళేనికి చెందిన ఎం వెంకటరమణయ్య తన పొలంలో 15 ఎకరాల్లోని గడ్డిని కొనుగోలు చేసి వామి వేశాడు. గడ్డివామిపై ఉన్న విద్యుత్ వైర్లు ఒకదానికొకటి రాసుకుని నిప్పు రవ్వలు ఎగిసిపడడంతో గడ్డివామి దగ్ధమైంది. సుమారు రూ.50వేలు నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ. 280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.280 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 371 బేళ్లను తీసుకురాగా, 279 బేళ్లను కొనుగోలు చేశారు. కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సరాసరిన రూ.249.07 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి టీ ఇషాక్‌స్వర్ణదత్ తెలిపారు.

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శనివారం 412 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 545 బేళ్లు రాగా, 412 బేళ్లను కొనుగోలు చేశారని, మిగిలిన బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.200, సగటున రూ.250.97 ధర పలికిందని వివరించారు.

పశువుల నీటి తొట్టెలు ప్రారంభం

కలిగిరి: మండలంలోని కలిగిరి, వీర్నకొల్లు, లక్ష్మీపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్టెలను ఎంపీడీఓ ప్రత్యూషారెడ్డి శనివారం ప్రారంభించారు. ఒక్కొక్క నీటి తొట్టిని రూ.31వేలతో నిర్మించినట్లు ఆమె తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

హౌస్‌ఫర్‌ఆల్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్: ప్రభుత్వం హౌస్ ఫర్ ఆల్ పథకం కింద ఇంటి స్థలాలు, పక్కాగృహాలను మంజూరు చేస్తోందని ఎంపీడీఓ అప్పాజీ శనివారం తెలిపారు. ఇంటి స్థలాలు, పక్కాగృహాలు లేని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే ప్రభుత్వ స్థలాల్లో అక్రమంగా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి రెగ్యులరైజ్ చేస్తారని తెలిపారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆస్పత్రికి వెళ్లొచ్చేలోగా..

15 సవర్ల బంగారం చోరీ

చేజర్ల(ఆత్మకూరు): ఆస్పత్రికి వెళ్లొచ్చేలోగా దొంగలు ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలను చోరీ చేసిన ఘటన చేజర్లలో చోటు చేసుకుంది.వివరాలు.. చేజర్లకు చెందిన షేక్ ఖాదర్‌బాషా తన కుమారుడికి అనారోగ్యంగా ఉండడంతో నెల్లూరులోని ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు భార్యతో కలిసి శుక్రవారం ఉదయం తీసుకుని వెళ్లాడు. రాత్రి తిరిగి వచ్చి చూడగా మేడపైన ఉన్న ఇంట్లోని బీరువా తెరిచి ఉంది. అందులోని సుమారు 15 సవర్ల బంగారు నగలు కనిపించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రాత్రి తన తల్లి నమాజ్ చేసుకునేందుకు కిందింట్లోకి వెళ్లిన క్రమంలో చోరీ జరిగి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపద తయారీ కేంద్రం పరిశీలన

సీతారామపురం : మండలంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఆత్మకూరు డీఎల్‌పీఓ షేక్ నయీమ్‌హసన్‌తాజ్ శనివారం పరిశీలించారు. సంపద కేంద్రాల ద్వారా పంచాయతీల ఆదాయ వనరులను పెంపొందించుకోవాలని కార్యదర్శులకు సూచించారు.

నల్లగొండ్లలో అందని రేషన్ సరుకులు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో మూడో వంతు లబ్ధిదారులకు కూడా రేషన్ సరుకులు అందలేదని గ్రామస్తులు తెలిపారు. రేషన్ పంపిణీకి ఆఖరిరోజైన శనివారం ఉదయం హడావుడిగా రేషన్ వాహనాన్ని పంపారు. కొంతమందికి సరుకులు ఇచ్చిన వెంటనే సర్వర్ ఆగిపోయింది. దీంతో మిగిలిన వారికి సరుకులు ఇచ్చే పరిస్థితి లేకుండాపోయింది. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ కాలనీవాసులకు పూర్తిస్థాయిలో సరుకులు అందలేదని వారు వాపోయారు. నల్లగొండ్లలో పనిచేస్తున్న రేషన్ డీలర్లను సస్పెండ్ చేయడంతో నందిగుంట డీలర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో రేషన్ సరుకులు సక్రమంగా అందడం లేదు. దీంతో గత నెలలో గ్రామస్తులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ను కలిసి రేషన్ సమస్యను విన్నవించారు. స్పందించిన ఆయన గ్రామంలోని పొదుపు గ్రూపునకు సరుకులు పంపిణీ చేసే బాధ్యతను అప్పగించాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. కానీ ఇంతవరకు ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. దీంతో రేషన్ సరుకులు పంపిణీ సమస్యగా మారింది. రేషన్ పంపిణీకి చివరిరోజైన శనివారం సాయంత్రం వరకు పేదలకు రేషన్ సరుకులు అందించడంలో అధికారులు విఫలమయ్యారు.

పొగాకు రైతుల ఆందోళన

- లోగ్రేడ్ పొగాకు కొనుగోలు చేయాలని డిమాండ్

కలిగిరి: ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పొగాకుకు గిట్టుబాటు ధరలు కల్పించాలని కోరుతూ రైతులు శనివారం కలిగిరి పొగాకు వేలం కేంద్రం వద్ద ఆందోళన చేపట్టారు. పలువురు రైతులు మాట్లాడుతూ వేలం ప్రారంభమై చాలా రోజులైనా ఇప్పటి వరకు వ్యాపారులు మీడియం, లోగ్రేడ్ పొగాకును అసలు కొనుగోలు చేయడం లేదన్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెంచకుండా రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారన్నారు. పొగాకు కొనుగోళ్లలో ఎక్కువగా నోబిడ్‌లు ఉండడంతో తాము అమ్మకానికి తీసుకు వచ్చిన పొగాకు బేళ్లను తిరిగి ఇళ్లకు తీసుకెళ్లవస్తుందన్నారు. దీంతో అదనపు భారం పడుతుందన్నారు. ఈ ఏడాది పెట్టుబడులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో మార్కెట్ ధరలు ఇలానే ఉంటే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వేలం నిర్వహణాధికారి టి.ఇషాక్ స్వర్ణదత్ ఆందోళన చేస్తున్న రైతులతో చర్చలు జరిపారు. అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి పొగాకు ధరలు ఉంటాయన్నారు. ప్రస్తుతం లోగ్రేడ్ పొగాకును కొనుగోలు చేయడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదన్నారు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా రైతులు బేళ్లను అమ్మకానికి తీసుకురావాలన్నారు. సోమవారం పొగాకు బోర్డు అధికారులతో జరిగే సమావేశం రైతుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళతామన్నారు. త్వరలోనే అన్ని గ్రేడ్ పొగాకును కొనుగోలు చేసేలా చూస్తామని, గిట్టుబాటు ధరలు లభించడానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. అనంతరం వేలం యథావిధిగా కొనసాగింది.



రైతులతో చర్చిస్తున్న వేలం నిర్వహణాధికారి టి. ఇషాక్‌స్వర్ణదత్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఆత్మకూరు: మండలంలోని కరటంపాడు సమీపంలో నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. ఆత్మకూరులో జరుగుతున్న ఓ వివాహానికి హాజరయ్యేందుకు బద్వేలుకు చెందిన నలుగురు వ్యక్తులు కారులో బయలుదేరారు. సంగం మండలానికి చెందిన దంపతులు బైక్‌పై మర్రిపాడు మీదుగా రాపూరుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరటంపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న దంపతుల్లో భర్తకు కాలు, తలకు గాయాలయ్యాయి. భార్య సురక్షితంగా బయటపడింది. బైక్ దెబ్బతింది. కారు టైరు సైతం పెద్ద శబ్దంతో పేలింది. స్థానికులు గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు

ఆత్మకూరు: సాంకేతిక విద్యతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, పదోతరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సాంకేతిక విద్య కోర్సుల్లో చేరాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వీ శ్రీలక్ష్మి సూచించారు. పట్టణంలోని పాలటెక్నిక్ కళాశాలలో జాబ్ ఆచీవర్స్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2025లో పాలటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ ఎంపికలు నిర్వహించినట్లు తెలిపారు. రాయల్ ఎన్‌ఫీల్డ్, వీల్స్ ఇండియా కంపెనీలు 29 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేసినట్లు వివరించారు. ఈసీఈ, మెకానికల్ బ్రాంచ్‌ల అధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి



మొక్కలు నాటుతున్న ఎంపీపీ పద్మజారెడ్డి

అనుమసముద్రంపేట: గ్రామాల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. వీధి దీపాలు వెలిగేలా చూడాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఎంపీడీఓ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

22న హనుమజ్జయంతి వేడుకలు

ఆత్మకూరు: పట్టణంలోని పంటవీధిలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 22 హనుమజ్జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు శనివారం తెలిపారు. వేకువజామున స్వామివారికి విశేష ద్రవ్యాలతో అభిషేకాలు, ఉదయం సహస్రనామార్చన, సింధూర పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. మధ్యాహ్నం భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు తెలిపారు.